క్లుప్తంగా

సీఎం ఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కు అందిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్: మండలకేంద్రంలో పలువురికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సీఎమ్మార్ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. బాధితులు వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకోగా.. వారికి వైద్య ఖర్చుల కోసం సీఎమ్మార్ఎఫ్ మంజూరైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు పులి హరిప్రసాద్, న్యావనంది శేఖర్, వెలిచాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: మండలంలోని కల్వకోటకు గ్రామానికి చెందిన గుగ్గిళ్ల రాజు–అనూషల పెళ్లికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

సంఘ భవనానికి స్థలం కేటాయించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మల్యాల: మండల పద్మశాలీ సంఘ భవనం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు ముల్క మల్లయ్య ఆధ్వర్యంలో ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతిపత్రం సమర్పించారు. ముత్యంపేట శివారులోని వరద కాలువ వద్ద ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందని, భవనం కోసం 40గుంటల స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బొమ్మకంటి గంగాధర్, కస్తూరి విశ్వనాథం, పెంట సుధాకర్ పాల్గొన్నారు.

బెంగళూరులో ఒగ్గుకథ ప్రదర్శన



ఒగ్గు కథ ప్రదర్శిస్తున్న కళా బృందం

మల్యాల: కొమురవెల్లి మల్లన్న ఒగ్గుకథ కళాబృందం బెంగళూరులో తెలంగాణ ప్రాచీన కళారూపం ఒగ్గు కథ ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, క్రైస్ట్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఒగ్గు కథా ప్రదర్శనలో కొమురవెల్లి మల్లన్న కళాబృందం సింగారపు రాజ్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఒగ్గు కథను ప్రదర్శించారు. ఒగ్గు కథ ప్రదర్శనలో మక్కపెల్లి మల్లేశం, సింగారపు ఓదయ్య, నక్క చంద్రయ్య, సింగారపు భూమయ్య, మక్కపెల్లి మల్లికార్జున్, బల్కం సూర్యం, నక్క శివరాం, తొట్ల స్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలి



మాట్లాడుతున్న జాదవ్ వెంకట్రావు నాయక్

జగిత్యాలజోన్: ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్రావు నాయక్ కోరారు. జిల్లా కేంద్రంలో ఆదివారం మాట్లాడారు. ప్రభుత్వం ఎస్‌జీటీల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు ఇస్తున్న ప్రభుత్వం, డిగ్రీలు, పీజీలు చదివిన ఎస్‌జీటీలకు ఎందుకు ఇవ్వడం లేదో అర్థం కావడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు నునావత్ రాజు, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాజేష్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్లయ్య, రామునాయక్, రవి పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

పెగడపల్లి: మండలంలోని రాత్రి భారీగా కురిసిన వర్షానికి ఓ ఇల్లు కూలింది. మండలంలోని బతికపల్లి గ్రామానికి చెందిన ఏగుర్ల లచ్చవ్వకు చెందిన పెంకుటిల్లు శనివారం రాత్రి కూలి పోయింది. ప్రమాద సమయంలో లచ్చవ్వ ఇంట్లో లేక పోవడంతో ప్రమాదం తప్పిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదుకోవాలని బాధితురాలు లచ్చవ్వ ప్రభుత్వాన్ని కోరారు.

ఫలించిన బుగ్గారం వాసుల కల

- ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ముందడుగు
- ప్రజాభీష్టం మేరకు మండల కేంద్రంలో భవనాల నిర్మాణం



బుగ్గారం మండల కేంద్రం

బుగ్గారం: నూతన మండలాల ఏర్పాటులో భాగంగా ధర్మపురి,గొల్లపల్లి మండలాల్లోని 11 గ్రామాలతో బుగ్గారం నూతన మండలంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు లేవు. ప్రారంభంలో పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాలు సహా పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలు చాలాకాలం పాటూ అద్దె భవనాల్లోనే కొనసాగాయి. దీనిపై ప్రజల నుంచి విమర్శలు రావడంతో ఇతర శాఖల భవనాలలో సర్దుబాటు చేశారు. అప్పటి నుంచి పోలీస్‌స్టేషన్ ఆరోగ్య ఉపకేంద్రంలో, ఎంపీడీవో కార్యాలయం ఎంఆర్సీ భవనంలో, తహసీల్దార్ కార్యాలయం ఎస్సీ హాస్టల్‌లో కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో వివిధ శాఖల ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు ఎప్పుడు నిర్మిస్తారని ప్రజలు,ప్రతిపక్ష నాయకులు పలుమార్లు ప్రజాప్రతినిధులను ప్రశ్నించారు.

నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలతో ఆలస్యం..

ఈ నేపథ్యంలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి గ్రామశివారులోని ఎదురుబోర్ల ప్రాంతంలో స్థలాన్ని కేటాయించారు.దీనిపై మండలంలోని కొంతమంది నాయకులు, ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోనే కావాల్సినంత ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ ఊరికి దూరంగా ప్రభుత్వ భవనాలు నిర్మించడమేంటని ప్రజాప్రతినిధులను నిలదీశారు. దీంతో వాటి నిర్మాణం ఆగిపోయింది. ప్రజాప్రతినిధులు, నాయకుల మధ్య విరుద్ధమైన అభిప్రాయాలు ఉండడం వీటి నిర్మాణానికి శాపంగా మారింది.

నిర్మాణానికి ముందడుగు..

ప్రభుత్వ కార్యాలయాల భవనాలు మండల కేంద్రంలోనే నిర్మిస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందని బుగ్గారం గ్రామ ప్రజలు, వీడీసీ నాయకులు డిమాండ్ చేశారు. సరిపడా స్థలం బుగ్గారంలోనే అందుబాటులో ఉందని సూచించారు. ఈ క్రమంలో ప్రభుత్వ విప్,ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఇటీవలే బుగ్గారం ప్రజలు,మండల అధికారులతో ప్రభుత్వ భవనాల నిర్మాణంపై చర్చించారు. ప్రజాభీష్టం మేరకే భవనాల నిర్మాణం జరుగుతుందని హామీ ఇచ్చారు. దీనికి అవసరమైన స్థలం సర్వే చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కొన్ని రోజులలోనే వీటి నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. దీంతో మండల వాసులు హర్షం చేశారు.

పోలీస్‌స్టేషన్ నిర్మాణమెక్కడ?

ప్రభుత్వ కార్యాలయాలకు సరిపోయేంత స్థలం బుగ్గారం గ్రామంలోనే ఉన్నప్పటికీ పోలీస్‌స్టేషన్ నిర్మాణంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. గ్రామంలోనే నిర్మించాలని కొందరు కోరుతుండగా, బుగ్గారం ఎక్స్ రోడ్డు సమీపంలో గతంలో పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించిన స్థలంలో స్టేషన్ నిర్మాణం చేపట్టాలని మరికొందరు డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రంలోనే నిర్మిస్తేనే అందరికీ అనుకూలంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి



నూతనంగా ఏర్పడిన మండలంలో నిర్మించాల్సిన ప్రభుత్వ కార్యాలయాల భవనాల ఏర్పాటు ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ప్రస్తుతం వీటి నిర్మాణంపై ప్రజాప్రతినిధులు,ఉన్నతాధికారులు దృష్టిసారించడం సంతోషకరం.వీటి నిర్మాణాన్ని సకాలంలో పూర్తిచేయాలి.

– చుక్క గంగారెడ్డి,మండలాభివృద్ధి కమిటీ కన్వీనర్

బుగ్గారం రూపురేఖలు మారిపోతాయి



గతంలో దశాబ్దాల తరబడి నియోజకవర్గ కేంద్రంగా ఉన్నప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదు. ఇప్పుడు ప్రభుత్వ భవనాలు నిర్మిస్తే మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉంటుంది. ప్రజాప్రతినిధులు బుగ్గారం మండలంపై ప్రత్యేక దృష్టిసారించి అభివృద్ధిలో ముందంజలో నిలపాలి.

– ఎర్రం లక్ష్మణ్, బుగ్గారం

ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



కొల్వాయిలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సారంగాపూర్: ఆరు గ్యారంటీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం బీర్‌పూర్ మండలం కొల్వాయి శ్రీరామాలయ కల్యాణమండపంలో 86 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటుందన్నారు. దీని ద్వారా ప్రజలకు ఆరోగ్య రక్షణకు అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన ఉండి ప్రజలకు సేవచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు ఉమ్మడి జిల్లా డైరెక్టర్లు ముప్పాల రాంచందర్‌రావు, మందాటి సాగర్, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

జగిత్యాలటౌన్: జగిత్యాల పావని కంటి ఆస్పత్రి , ఆపి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జగిత్యాల నియోజకవర్గ పరిసర ప్రాంతాలకు చెందిన 17మంది నిరుపేదలకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేసి కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్, నాయకులు క్యాదాసు నాగయ్య, పోతుసుక మహేశ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పీజీ ఎంట్రెన్స్ పరీక్షలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు

కోరుట్లటౌన్: సీపీగేట్ ఎంట్రన్స్‌లో పీజీ ఎం.ఏ. ఎకనామిక్స్ ఎంట్రెన్స్ పరీక్షలో కోరుట్ల విద్యార్థి తూడూరి సుమంత్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తూడూరి సతీష్–శ్రీలలిత దంపతుల రెండో కుమారుడు సుమంత్ కల్లూర్‌లోని అక్షర హైస్కూల్‌లో పదో తరగతి, హైదరాబాద్ నారాయణ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. తమిళనాడు రాష్ట్రంలోని సెంట్రల్ యూనివర్శిటీ తిరువురూర్‌లో డిగ్రీ పూర్తి అయ్యింది. ఇటీవల విడుదలైన సీపీగేట్ పీజీ ఎం.ఏ. ఎకనామిక్స్ సబ్జెక్ట్ ఎంట్రెన్స్ పరీక్షలో ప్రథమ ర్యాంకు వచ్చింది. సుమంత్‌ను ఆదర్శనగర్ కాలనీ వాసులు అభినందించారు.

విద్యార్థినికి సన్మానం

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన బాస గంగోత్రి సీపీగేట్) 2024లో ఎంఎస్సీ బాటనీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 14 వ ర్యాంకు సాధించి గంగోత్రిని రేచపల్లి గ్రామస్తులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కోండ్ర రాంచంద్రారెడ్డి, మోత్కూరి ప్రసాద్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు అంత్యక్రియలకు ఆర్థికసాయం

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన బేతి బుచ్చిరెడ్డి అనే రైతు ఆదివారం మృతి చెందాడు. రాయికల్ సహకార సంఘంలో సభ్యత్వం ఉండడంతో దహన సంస్కారాల కోసం 10,000 ఆర్థికసాయాన్ని సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సీఈవో ఎలగేటిరవి కుమార్, డైరెక్టర్లు కొల్ల నారాయణ, నాయకులు గన్నె రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

జగిత్యాలటౌన్: అర్హతగల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటులో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని, పత్రికా రంగంలో పనిచేస్తున్న 90 శాతం మమంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులతో కొట్టు మిట్టాడుతున్నారని వారిని ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేలా ప్రభుత్వాన్ని ఒప్పించాలని శ్రీనివాసరెడ్డిని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతరెడ్డి, సదానందగౌడ్, రాష్ట్ర కార్యదర్శి రవీందర్, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బైరం హరికిరణ్, శివరామకృష్ణ ఉన్నారు.

కెపాసిటర్లతో విద్యుత్ ఆదా

మెట్‌పల్లిరూరల్: వ్యవసాయ పంపుసెట్‌లకు కెపాసిటర్లు బిగించుకోవడం వల్ల విద్యుత్ ఆదా అవుతుందని మెట్‌పల్లి విద్యుత్ ఏడీఈ మనోహర్ అన్నారు. మెట్‌పల్లి మండలం వెల్లుల రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 1200 వ్యవసాయ పంపుసెట్‌లకు కెపాసిటర్లను తెప్పించారు. ఈ సందర్భంగా ఆదివారం వారిని అభినందించిన ఆయన, కెపాసిటర్ల వల్ల కలిగే లాభాల గురించి రైతులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్లు అమర్చుకునేందుకు వెల్లుల రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. కెపాసిటర్‌ల వల్ల 20 శాతం విద్యుత్ ఆదా అవడంతో పాటు ,మోటార్,ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోకుండా ఉంటాయన్నారు. ఒక పంపుసెట్‌కు ఏడాదిలో సుమారుగా రూ.25 వేల విద్యుత్ వినియోగం అవుతుందని,కెపాసిటర్ బిగింపు ద్వారా రూ.5 వేలు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ నవీన్,విద్యుత్ సిబ్బంది శ్రీధర్,శివ, జలపతి, రాజేశ్,దిలీప్,రైతులు మురళీధర్‌రెడ్డి, నారాయణ,రాజేశ్,గంగారెడ్డి, సంజీవ్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

- **సెల్‌ఫోన్ ఇవ్వడం లేదని చేయి కోసుకున్న వ్యక్తి**

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద రిపేర్‌కు ఇచ్చిన సెల్‌ఫోన్‌ను ఇవ్వడం లేదని చేయి కోసుకొని హల్ చేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఇట్యాల రమేశ్ కొద్దికాలంగా మెట్‌పల్లి మండలం చిన్నమెట్‌పల్లిలో మేస్త్రీ పనులు చేస్తున్నాడు. తన సెల్‌ఫోన్ చెడిపోవడంతో మరమ్మతు కోసం కొత్త బస్టాండ్ సమీపంలోని ఓ సెల్ పాయింట్‌లో ఇచ్చాడు. షాపు యజమాని మూడు రోజులైనా ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై షాపు ముందే బ్లేడ్‌తో చేయి కోసుకున్నాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు 108కు సమాచారమందించగా, ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

- **అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు**

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లిలో అదనపు వరకట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం అర్పపల్లి గ్రామానికి చెందిన పోచంపల్లి అంజలికి మూడేళ్ల క్రితం పోచంపల్లి నర్సింగ్‌తో వివాహం జరిగింది. వివాహ సమయంలో అంజలి తల్లితండ్రులు పెళ్లిలో ఒప్పుకున్న మేరకు కట్నకానుకలు అప్పజెప్పారు. నర్సింగ్ అదనంగా మరో రూ. 2 లక్షలు కట్నం తీసుకురావాలని అంజలిని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. వేధింపులు తాళలేక అంజలి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో భర్త నర్సింగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

- **కౌన్సిలర్‌పై కేసు నమోదు**

కోరుట్ల: పట్టణానికి చెందిన బీజేపీ కౌన్సిలర్ మాడవేని నరేశ్ ఓ వాట్సాప్ గ్రూపులో పంపిన వీడియో అల్లర్లు రెచ్చగొట్టే రీతిలో ఉందన్న కారణంగా బీఎన్ఎస్ ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు.

- **పేకాటరాయుళ్ల అరెస్ట్**

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో ఆదివారం సాయంత్రం ఓ ఇంట్లో రహస్యంగా పేకాట ఆడుతుండగా పట్టణ ఎస్సై వేణుగోపాల్ ఆ ఇంట్లో తనిఖీలు చేపట్టగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6900 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.

- **విలువైన వస్తువులు లాకర్లలో దాచుకోవాలి**

మల్యాల: ఇంట్లో విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో దాచుకోవాలని, ఇంటికి తాళం వేసి, ఊరికి వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై నరేశ్‌కుమార్ కోరారు.మండలంలో ఇటీవల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో అనుమానాస్పద వ్యక్తులు కనపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. శుభకార్యాలకు ఇతర గ్రామాలకు తరలివెళ్లేవారు తప్పనిసరిగా ఇంటి పరిసరాల్లో ఉన్న వారికి చెప్పడంతోపాటు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై పేర్కొన్నారు.

- **కొవ్వొత్తులతో ర్యాలీ**

రాయికల్: బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఆదివారం రాత్రి మండలంలోని మైతాపూర్‌లో గ్రామ నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి సంతాపంగా నివాళి అర్పించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అభివృద్ధి పనులకు భూమిపూజ

కోరుట్లటౌన్: పట్టణంలోని శ్రీఅయ్యప్ప ఆలయంలో రూ.30 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ ఆదివారం నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రహరీ నూతన నిర్మాణం చేపట్టనున్నట్లు ఆలయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తెలిపారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'మంత్రి బండి సంజయ్‌పై వ్యాఖ్యలు ఉప సంహరించుకోవాలి'

మల్యాల: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై కాంగ్రెస్ నాయకుడు వెలిచాల రాజేందర్ రావు చేసిన వ్యాఖ్యలను ఉప సంహరించుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మల్యాలలో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ చేసిన అభివృద్ధి పనులను తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.కార్యక్రమంలో మండలాధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్, గాజుల మల్లేశం, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, రవి, రాజన్న, మల్లేశం, రమేశ్, సురేశ్, మహిపాల్, మధు, మోనిక్, ఆనందం తదితరులు పాల్గొన్నారు.



పైప్‌లైన్ లీకేజీని పట్టించుకునేవారేరి?

జగిత్యాలటౌన్: జగిత్యాల ధర్మారం ప్రధాన రహదారిని ఆనుకుని గొల్లపల్లి మండల కేంద్రంలోని వైన్స్ పక్కన చికెన్ సెంటర్ ముందు మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో పెద్ద గుంత ఏర్పడి దోమలకు నిలయంగా మారింది. సంబంధిత అధికారులకు విన్నవించినా స్పందించడం లేదు. పై అధికారులు చొరవ తీసుకుని పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతు చేయాలి.

– ఎండీ మాజీద్, స్థానికుడు

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346639

శభాష్ రైతన్న..

- కేజీవీల్స్ ట్రాక్టర్‌ను మరో ట్రాక్టర్‌తో తీసుకెళ్తున్న రైతు
- కారు ఆపి రైతును అభినందించిన కోరుట్ల ఎమ్మెల్యే



రైతును అభినందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్



కేజీవీల్ ట్రాక్టర్‌ను మరో ట్రాక్టర్‌పై తరలింపు

మెట్‌పల్లిరూరల్: కేజీవీల్స్‌తో ఉన్న ట్రాక్టర్‌ను మరో ట్రాక్టర్ సహాయంతో తీసుకెళ్తున్న రైతులను కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అభినందించారు. రెండు రోజుల క్రితం మెట్‌పల్లి మండలం కోనరావుపేటలో చెక్కులు పంపిణీ చేసి తిరిగి వస్తున్న ఆయనకు, రామారావుపల్లెకు చెందిన విలసాగరపు గంగాధర్,ఇంద్రాల రత్నాకర్ కేజీవీల్స్ ట్రాక్టర్‌ను మరో ట్రాక్టర్ సహాయంతో తీసుకెళ్లడం కనిపించింది.దీంతో ఎమ్మెల్యే సంజయ్ వెంటనే కారులో నుండి దిగి వారిని ఆపి ఆ ఇద్దరిని అభినందించారు.సామాజిక బాధ్యతతో రైతులు కేజీవీల్ ట్రాక్టర్లను ఇలా తీసుకెళ్తే రహదారులు దెబ్బతినకుండా ఉంటాయన్నారు.

నియామకం

నూర్ బాషా సంఘం అధ్యక్షుడిగా అబ్దుల్ రబ్



రబ్ ను సన్మానిస్తున్న నాయకులు

మెట్‌పల్లి: పట్టణ నూర్ బాషా(ముస్లిం) కమిటీ అధ్యక్ష ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఈ పదవికి అబ్దుల్ రబ్, ఎండీ రజాక్ పోటీ పడ్డారు. ఇందులో అత్యధిక ఓట్లు సాధించి రబ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అనంతరం ఆయనను మర్కజీ ఇంతేజామి కమిటీ అధ్యక్షుడు ఖుత్బొద్దీన్‌పాషాతో పాటు సంఘ సభ్యులు పలువురు సన్మానించారు. నూర్ బాషాల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని రబీ పేర్కొన్నారు.

గంగపుత్ర సంఘం పట్టణ కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి: పట్టణ గంగపుత్ర(బెస్త) సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మానుకాల చిన్నయ్య, ఉపాధ్యక్షుడిగా మానుకాల పోచయ్య, కార్యదర్శిగా పర్రె వినోద్, సహాయ కార్యదర్శిగా పారిపెల్లి కిషన్, కోశాధికారిగా చింతకింది సురేశ్, ముఖ్య సలహాదారులుగా పరిమి నర్సయ్య, కుడుముల సాయన్నలను ఎన్నుకున్నారు.

పద్మశాలీ సంఘం మేడిపల్లి గ్రామ అధ్యక్షుడిగా మ్యాకల రాజేశం

మేడిపల్లి: మార్కండేయ పద్మశాలీ సంఘం మేడిపల్లి గ్రామ నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మ్యాకల రాజేశం, ఉపాధ్యక్షుడిగా దీకొండ గణేశ్, కార్యదర్శిగా బండారి మహేశ్, సహ కార్యదర్శిగా రాపెల్లి మురళి, కోశాధికారిగా మ్యాకల కిశోర్, తదితరులను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. వారి ఎన్నికకు సహకరించిన పద్మశాలీ సంఘం సభ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీలో కురిసెంగ వేణు

రాయికల్: ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీలో రాయికల్ పట్టణానికి చెందిన ఆదివాసీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కురిసెంగ వేణు నియమిస్తూ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కు కృషి చేస్తానన్నారు. తన నియమకానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేణును పలువురు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

- **ఓటు ప్రాముఖ్యతపై అవగాహన**

జగిత్యాలటౌన్: ఓటు హక్కు ప్రాముఖ్యతను చాటి చెప్పాలని ఆదివారం జగిత్యాల పట్టణంలోని జ్యోతి ఐఐటీ అకాడమీలో స్టూడెంట్స్ కౌన్సిల్ ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించారు. ఓటింగ్ అనంతరం ఫలితాలను ప్రకటించి విజేతలను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ హరిచరణ్‌రావు విఘ్నేశ్, రాగిణి, తౌసిఫ్ అలి, శ్రీహంసిక,అభిరాం, విద్యార్థులు పాల్గొన్నారు.

- **ఉచిత మెగా వైద్య శిబిరం**

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామ పంచాయతీ వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఇదే కాకుండా ఐదు బృందాలతో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వర సర్వే నిర్వహించారు. మొత్తంగా 45 మందికి జ్వరం ఉన్నట్లు గుర్తించారు. ఇందులో పలువురి రక్త నమునాలను సేకరించి వైద్య పరీక్షలకు పంపించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అంజిత్‌రెడ్డి డాక్టర్లు నాగార్జున, నిఖిల,లత,సిబ్బందిపాల్గొన్నారు.

గొల్లపల్లి: మండల కేంద్రంలో స్టార్ హాస్పిటల్,లక్ష్మీపూర్‌లో శాంతి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

- **పోతారంలో ఉచిత వైద్య శిబిరం**

మల్యాల: మండలంలోని పోతారం గ్రామంలో శ్రీ పావని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి సుమారు 200మంది రోగులకు ఉచితంగా బీపీ, షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

- **నేడు దూలూర్‌లో ఉచిత నేత్ర వైద్యశిబిరం**

కథలాపూర్: మండలంలోని దూలూర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.